ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 35.0 । కనిష్ఠం : 19.0



ప్రజల పాటల్లో సజీవి సుద్దాల



సమావేశంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

6

ప్రకృతి రమణీయం
అంజనగిరి

- ఆహ్లాదం, ప్రశాంతతకు నిలయం
- గట్టుకాడిపల్లి అంజనగిరి క్షేత్రంలో స్వయంభువుగా వేంకటేశ్వర స్వామి
- ఈనెల 8 నుంచి 13 వరకు బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు

7



గట్టుకాడిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం

అబద్ధపు హామీలతో అధికారంలోకి..

- కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారు
- రైతుదీక్షకు కేటీఆర్ రాక
- మాజీ ఎమ్మెల్యే గుర్కజైపాల్‌యాదవ్

7

నిలిచిన డీసీఎం...
ఆగిన ఊపిరి

- పార్క్ చేసిన డీసీఎంను ఢీకొట్టిన ద్విచక్రవాహనం
- ఇద్దరు వైద్య విద్యార్థుల దుర్మరణం
- పాలమూరులో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

6



జ్ఞానేశ్వర్ (ఫైల్)




శశాంక్ (ఫైల్)

ముందేదీ?

● పంచాయతీలా.. ప్రాదేశికమా..?

- నేటికి ఎన్నికలు జరుగుతాయని సర్వత్రా చర్చ
- బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ ప్రకటనతో లైన్ క్లియర్
- ప్రాదేశిక ఎన్నికలే ముందుగా జరుగుతాయనే సంకేతాలు
- ఇప్పటికే గ్రామాల్లో పాత, కొత్త నాయకులతో పోటీ వాతావరణం
- టిక్కెట్ల కేటాయింపు కోసం ఎమ్మెల్యేలు, పార్టీల కసరత్తు షురూ..



ఓ పక్క పంచాయతీ.. మరోపక్క ప్రాదేశికం.. వీటి ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో వీటిలో మొదటగా దేనికి ఎన్నికలు నిర్వహిస్తారన్న మీమాంస నెలకొన్నది. అయితే, ఏడాదిగా పంచాయతీకి, 7 నెలలుగా ప్రాదేశిక ఎన్నికలు జరుపకపోవడంతో.. ఈ రెండూ ఒకేసారి నిర్వహిస్తే బాగుంటుందన్న చర్చ కూడా తెరపైకి వస్తోంది. ఇందులో పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకపోయినప్పటికీ.. పార్టీ అభ్యర్థులుగానే బరిలోకి దిగుతారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు మాత్రం పార్టీ గుర్తులపైనే అభ్యర్థులు పోటీలో నిలుస్తారు. ఇదిలా ఉంటే.. ఇప్పటికే అధికారులు ఓటర్ల జాబితాను సిద్ధం చేయగా.. బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, ఎన్నికల పత్రాల ముద్రణ, బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయడం, గుర్తులను కూడా ప్రకటించడం చకచకా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆశావహులు ఆయా పార్టీల ముఖ్యులతో ఇప్పటికే మంతనాలు షురూ చేయడం గమనార్హం.

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): షెడ్యూల్ ప్ర కారం నిర్వహించాల్సిన పంచాయతీ ఎన్నికలు ఇప్పటికే సంవత్సరం ఆ లస్యమవుతుండగా.. ప్రాదేశిక స్థానాల ఎన్నికలు దాదాపు ఏడు నెలలు ఆలస్యమయ్యాయి. ఇంకా ఎప్పుడు వీటి ఎన్నికలకు నోటిఫికేషన్ విడు దలవుతుందో చెప్పలేని పరిస్థితులు ఉన్నాయి. మునిసిపాలిటీలకు కూడా గత నెల 26తో పాలకవర్గం గడువు ముగిసింది. ముందుగా పంచా యతీ, ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాత మునిసిపల్ ఎన్నికలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం మునిసిపాలిటీలు, జిల్లా, మండల పరిషత్‌లు, పంచాయతీలు అన్నీ ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. ఇప్పటికే అధికారులు ఓటర్ల జాబితాను సిద్ధం చేయగా.. బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, ఎన్నికల పత్రాల ముద్రణ, బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయడం, గుర్తులను కూడా ప్రకటించడం చకచకా చేస్తున్నారు. మెజారిటీ ఎన్నికల పనులు అధికారుల పరంగా పూర్తయినట్లే.. ఎప్పుడు ఎన్ని కలు వచ్చినా సిద్ధంగా

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలు

జిల్లా	పంచాయతీలు	ఎంపీటీసీ స్థానాలు
మహబూబ్‌నగర్	439	169
నాగర్‌కర్నూలు	461	210
నారాయణపేట	280	140
వనపర్తి	255	128
జోగుళాంబ గద్వాల	255	141

ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అ యితే కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ కులగణన చేసి.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించడమే ఈ ఆల స్యానికి కారణం కాగా.. గత సంవత్సరం చివరిలో ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సమగ్ర సర్వే నిర్వహించింది. ఆ రిపోర్టును మంగళవారం



వనపర్తి జిల్లా గట్టుకాడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి.. సీఎం రేవంత్‌రెడ్డి అ సెంబ్లీలో ప్రకటించారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 46.25శాతం ఉన్నారని, 42శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాజ్యాంగ సవరణతో ముడిపెట్టుకున్న అంశం

- మిగతా 6లో..



మంచాలకట్ట శివారులో సాగుచేసిన వేరుశనగ పంట

కృష్ణా నదిలో..
సిరుల పంటలు

- నదిలో నీరు తగ్గాక వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న రైతులు
- రసాయన ఎరువులు వాడకపోవడంతో నాణ్యతగా వస్తున్న దిగుబడులు
- నీటి తడులు, కలుపు తీసే పని కూడా ఉండదు
- పొలాన్ని కౌలుకు తీసుకునేందుకు పెరుగుతున్న డిమాండ్



కృష్ణానదిలో విత్తనాలు విత్తుతున్న రైతులు

6

కృష్ణానదిని జీవ నదిగా పిలిస్తే బాగుండేది. ఎందుకంటే నది నిండితే మత్స్య సంపద, ఎండితే పంటలకు జీవం పోస్తూ మత్స్యకారులకు, రైతులకు సిరులు కురిపిస్తున్నది. నది నిండినా.. ఎండినా ఉపాధినిస్తున్నది. ప్రస్తుతం నదిలో నీటి మట్టం తగ్గడంతో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో కృష్ణానదిలో ముంపునకు గురైన దాదాపు రెండువేల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో నీరు పూర్తిగా తగ్గుతుండటంతో రైతులు వివిధ రకాల పంటలు సాగుచేశారు. ఇంకా కొందరు సాగుచేస్తున్నారు. ఇక్కడ సాగుచేసే పంటల దిగుబడి నాణ్యతగా ఉంటుంది. ఎందుకంటే పంటకు ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా సహజసిద్ధంగా సాగు చేస్తారు. దీంతో నదిలో పంట సాగు చేసే భూములకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది.

- పెంట్లవెల్లి, ఆంధ్రజ్యోతి

సాధారణ ప్రసవాలు చేయాలి



కోడేరు పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

కోడేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని పీహెచ్‌సీ, ప్రభుత్వ పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రులో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా వైద్యం అందించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను, సరకులను పరిశీలించారు. మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షల్లో వంద శాతం మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు మొబైల్ ఫోన్లను బహుమతిగా ఇస్తానని, లేదా మంచి కాలేజీలో అడ్మిషన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత పాఠశాలలో కనీస వసతులు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించి రానున్న వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ సురేందర్ తదితరులు ఉన్నారు.

నడిగడ్డ కీర్తిని చాటాలి

- ● డీఎఫ్ఏ అధ్యక్షుడు బండల వెంకట్రాములు
- ● ఫుట్‌బాల్ ఫైవ్-ఏ సైడ్ పోటీలు ప్రారంభం

గద్వాలఅర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులే కాకుండా నడిగడ్డలో ఫుట్‌బాల్ క్రీడకు కూడా ప్రఖ్యాతి గాంచిందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియే షన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, డీవైఎస్‌వో జితేందర్ అన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలో ఫుట్‌బాల్ ఫైవ్-ఏ సైడ్ బాలురు, బాలికల లీగ్ పోటీలకు వారు ముఖ్యఅతిథులు హాజరై మాట్లాడారు. గద్వాల అంటే ఫుట్‌బాల్ అన్న రీతిలో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తుండటం అభినంద నీయమన్నారు. తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ వారు నిర్వహించిన సీనియర్స్, జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి జిల్లా అసోసియే షన్‌కు పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తుండటం సంతోషకరమన్నారు. గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్లలో విజేతలుగా నిలిచారన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రెండురోజుల పాటు నిర్వ హించే లీగ్ పోటీలకు జిల్లాలోని పది క్లబ్‌లు పాల్గొంటు న్నట్లు తెలిపారు. అనంతరం వివిధ క్లబ్‌లకు సంబంధిం చిన జర్సీలను లాంచ్ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్ సేవా సమితి అధ్యక్షుడు ఇండికా శివ, కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్ బండల పాండు, సీనియర్ క్రీడాకారులు వెంకట్‌రెడ్డి, చక్ర, రాజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, అజయ్, జూనియర్ క్రీడాకారులు ఉన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో జితేందర్

బాధిత మహిళలకు
'భరోసా'తో న్యాయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, చిత్రంలో ఎస్పీ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వేధింపులకు గురైన బాలికలు, మహిళలకు భరోసా కేంద్రాల ద్వారా న్యాయం జరుగుతుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. వనపర్తి జిల్లాలో భరోసా కేంద్రం ఏర్పాటు చేసి ఏడాది పూర్తి అయిన సందర్భంగా గురువారం పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఉన్న భరోసా కేంద్రంలో జిల్లా ఎస్పీ రావులగిరిధర్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి భరోసా కేంద్రంలో కేక్ కట్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... తెలిసీ తెలియని వయసులో ఉన్న బాలికలు, సమాజంలో లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, గృహహింసకు గురైన మహిళలు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. భరోసా కేంద్రం ఏర్పాటు చేసిన తరువా త 43 కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేశామన్నారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ... బాధిత బాలికలకు, మహిళలకు వైద్య పరంగా, న్యాయ సేవా పరంగా విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం చేస్తూ భరోసా కేంద్రం అండగా నిలుస్తుందన్నారు. మంచిఫలితాలు సాధించినందుకు సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, భరోసా కోఆర్డినేటర్ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుకను తోడే ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న స్థానికులు

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

వంగూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాజాల ఉల్పార వద్ద ఉన్న వాగునుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను గురువారం స్థానికులు అడ్డుకున్నారు. ప్రభుత్వం అభివృద్ధి పనులకు అని చెప్పి దుందుభీ వాగునుంచి ఇసుకను తరలిస్తుండగా స్థానికులు టిప్పర్లను నిలిపి టైర్లలో గాలి తీసి అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మహేందర్ సిబ్బందితో వచ్చి ఇసుక టిప్పర్లను పరిశీలించారు. అభివృద్ధి పనులకు ఇసుకను తీసుకెళ్తున్నామని చెప్పడంతో ఆ వివరాలను పూర్తిగా తెలుసుకుని టిప్పర్లను పంపించారు. వాగులో ఇసుకను తీసుకెళ్లడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి బోరుబావులు దెబ్బతినే ప్రమాదం ఉందని, ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

అదృష్టాన్ని చెరిపేశారు

- డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో వివాదం
- డిప్పులో ఎంపికైన 84మంది పేర్ల తొలగింపు
- వారి పేర్లపై ఇదివరకే 'ఇందిరమ్మ' బిల్లులు
- తొలగింపబడిన వారందరూ ఇళ్లు లేని నిరుపేదలు

7

గద్వాలలో డబుల్ బెడ్రూం ఇళ్ల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. డబుల్ బెడ్రూం ఇళ్ల లక్కీడిప్‌లో పేర్లు వచ్చిన నిరుపేదలు సొంతింటి కలనెరవేరుతోందని, తమకు అదృష్టం కలిసివచ్చిందని సంబురపడ్డారు. కానీ, కొద్దిరోజుల్లోనే అధికారులు వారి అదృష్టాన్ని చెరిపేశారు. లక్కీడిప్‌లో ఇళ్లు వచ్చిన 84 మంది లబ్ధిదారుల పేర్లు తొలగించి షాక్ ఇచ్చారు. మీ పేర్లపై ఇదివరకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు ఉన్నదని చెప్పారు. కానీ వాస్తవానికి వారు ఇదివరకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిపొందలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వారి పేర్లమీద నాయకులు ఇందిరమ్మ బిల్లులు కాజేసి ఉండొచ్చనే వాదన వినిపిస్తోంది.

- గద్వాల, ఆంధ్రజ్యోతి



గద్వాల పట్టణ శివారులోని దౌదర్‌పల్లి దర్గా వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

నిలిచిన డీసీఎం... ఆగిన ఊపిరి

- నిలిచి ఉన్న డీసీఎంను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- ఇద్దరు వైద్య విద్యార్థుల దుర్మరణం
- పాలమూరులో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపక్కన అర్ధరాత్రి డీసీఎం వాహనాన్ని పార్క్ చేశారు. మూలమలుపు నుంచి వేగంగా రోడ్డుపైకి వచ్చిన ద్విచక్ర వాహనం రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎం గమనించేలోపే కంట్రోల్ కాక ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వైద్యవిద్యార్థుల తలలు పగిలి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి 2 గంటల తరువాత మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో చోటుచేసుకున్నది. నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన ఎన్ శశాంక్(19), నల్గొండ జిల్లా కొండమల్లెపల్లికి చెందిన బి జ్ఞానేశ్వర్(19)లకు మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బీఎస్సీ ఏహెచ్ఎస్(అలైడ్ హెల్త్ సైన్సెస్)లో సీట్లు రావడంతో జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్టలో అద్దెగది తీసుకున్నారు. వీళ్ళు మొదటి సంవత్సరం కావడంతో ఇంకా తరగతులు ప్రారంభం కాలేదు. గురువారం ఓరియెంటేషన్ క్లాస్ జరగాల్సి ఉంది. శుక్రవారం నుంచి రెగ్యులర్‌గా క్లాస్‌లు ప్రారంభం కానున్నాయి. ఇంతలోనే ఈ ఘోరం జరిగిపోయింది.

పోలీసుల వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి తరువాత మెడికల్ షాప్‌లో మెడిసిన్ కోసం జ్ఞానేశ్వర్, శశాంక్‌లు ద్విచక్ర వాహనంపై షాషాబ్‌గుట్టలో తాము నివాసం ఉంటున్న గది నుంచి బయటకు వచ్చారు. వాహనంపై వచ్చిన వారు ప్రధాన రహదారిపైకి వచ్చి బస్టాండ్‌వైపు వేగంగా మళ్ళగానే ఎదురుగా మలబార్ గోల్డ్ షాపు ముందు ఆగి ఉన్న డీసీఎంను అంతే వేగంగా ఢీకొట్టారు. ఆ సమయంలో ఆ వాహనం అక్కడ ఆగి ఉన్నదా, కదులుతున్నదా అన్న విషయం గ్రహించేలోపు వాహనం వేగంగా వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరి తలలు పగిలి తీవ్ర రక్తస్రావం జరిగింది. చెవులు, ముక్కుల నుంచి రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న టుటౌన్ పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుల తండ్రులు గోపాల్‌రావు, కృష్ణయ్య ఫిర్యాదుమేరకు టుటౌన్ ఎస్సై విజయభాస్కర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పాలమూరులోని మర్లుకు చెందిన డ్రైవర్ వెంకటేశ్ తన డీసీఎంను నిర్లక్ష్యంగా అర్ధరాత్రి రోడ్డుపై పార్క్‌చేసి నిద్రపోయాడు. ఇదే ఇప్పుడు రెండు నిండుప్రాణాలను బలగొనడానికి కారణం కావడంతో పోలీసులు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

● **కన్నవాళ్లకు కడుపుకోత..**

నారాయణపేటకు చెందిన శశాంక్ తండ్రి గోపాలరావు కూలీ పనిచేస్తాడు. ఈయనకు ముగ్గురు ఆడపిల్లలు కాగా ఒకే కొడుకు. కష్టపడి కొడుకును చదివించారు. ఉన్నత చదువులు చదువుతున్నాడని తల్లిదండ్రులు సంతోషించేలోపు ఉన్న ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో తల్లిదండ్రులకు తీరని కడుపుకోతను మిగిల్చింది. జ్ఞానేశ్వర్ తండ్రి బత్తుల కృష్ణయ్య డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు. డ్రైవర్ పనిచేసి కొడుకును ఉన్నతంగా చదివించాలని భావించిన తల్లిదండ్రుల ఆశలు తీరకముందే కొడుకులు రోడ్డుప్రమాదం రూపంలో ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబాలలో తీరని విషాదాన్ని నింపింది.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వండి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలంటూ రైతులు ధర్నా చేపట్టారు. మక్తల్ మండలంలో 19 గ్రామాలకు చెందిన 3 వేల మంది రైతులం భూములు కోల్పోయామని, పరిహారం చెల్లిస్తామని ఇప్పటివరకు కాలయాపన చేస్తూ వస్తున్నారని వాపోయారు. దీంతో గురువారం రైతులు మహబూబ్ నగర్‌లోని ఎదిర రోడ్డులో ఉన్న భారత్‌మాల ప్రాదికారిక సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ప్రాజెక్టులో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భూ ములు కోల్పోయిన రైతులకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా దేవాలయాలు, మసీదులు, చర్చీలు కోల్పోయిన వాటికి పరిహారంతో పాటు నూతనం గా నిర్మించాలన్నారు. భవనాలు, ఇళ్లు కోల్పోయిన వారికి మెరుగైన ప రిహారం అందజేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి న శించాలంటూ రైతులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా హైవే అథారిటీకి సంబంధించిన పీడీ రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. నెల రోజు ల్లో పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు.

ముందేది?

(5వ పేజీ తరువాయి)

కాబట్టి.. ఒకవేళ కేంద్రం చట్టబద్ధత కల్పించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆ మేరకు బీసీలకు సీట్లు ఇస్తుందని చెప్పారు.

లైన్ క్లియర్ అయినట్లేనా..?

కులగణన వివరాలు ప్రకటించడంతో పాటు ఎన్నికల హామీ మేరకు 42శాతం సీట్లను బీసీలకు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడంతో ఎన్నికలకు లైన్ క్లియర్ అయినట్లేనని పలువురు భావిస్తున్నారు. అయితే సంవత్సరం ఆలస్యమైన పంచాయతీ ఎన్నికలను ముందుగా నిర్వహిస్తారా? లేక ఏడు నెలలవుతున్నా ప్రాదేశిక ఎన్నికలకు ముందుగా నోటిఫికేషన్ విడుదల చేస్తారా? అనే చర్చ ఇప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరుగుతోంది. కొందరు ప్రభుత్వ ముఖ్యులు, ప్రజాప్రతినిధులు ప్రాదేశిక ఎన్నికలే ముందుగా జరుగుతాయనే సంకేతాలు ఇస్తున్నారు. అయితే ఇప్పటికే రైతు భరోసా, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా పథకాల అమలు మందకొడిగా సాగుతోంది. మార్చి 31 వరకు ప్రక్రియ పూర్తవుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వీటి విడుదల ఆలస్యంతో కొంత ప్రజల్లో నైరాశ్యం నెలకొనడంతో అది అధికార పార్టీకి వ్యతిరేక ఓటుగా మారకూడదనే ఉద్దేశంలో ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాదేశిక ఎన్నికలు ముందుగా నిర్వహించి.. అవి పూర్తయిన తర్వాత పంచాయతీ ఎన్నికలకు వెళ్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే బీసీ రిజర్వేషన్లకు లైన్ క్లియర్ అయినందున.. రెండు ఎన్నికలకు ఒకేసారి వెళ్లవచ్చనే చర్చ కూడా నడుస్తోంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకపోయినప్పటికీ.. పార్టీ అభ్యర్థులుగానే బరిలోకి దిగుతారు.


ఎన్నికలకు సిద్ధంగా ఉంచిన సామాగ్రి

ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు మాత్రం పార్టీ గుర్తులపైనే అభ్యర్థులు పోటీలో నిలుస్తారు.

అభ్యర్థిత్వం కోసం పోటీ వాతావరణం

ఎన్నికలకు సంబంధించిన సంకేతాలు ప్రభుత్వ వర్గాల నుంచి వెలువడుతుండటం తో గ్రామాల్లో అభ్యర్థిత్వం కోసం పోటీ వాతా వరణం నెలకొందని చెప్పవచ్చు. దాదాపు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. అధికార పార్టీకి కొంత ప్రభుత్వ బ లం ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థిత్వం కోసం ఎక్కువ పోటీ ఏర్పడనుంది. ఎమ్మెల్యేలుగా గె లిచిన వారు కూడా తమవెంట, పార్టీ వెన్నంటి ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తామని పలు మార్లు ప్రకటించారు. అయితే ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సమయంలో చాలామంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు జంప్ కొట్టారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో పాత, కొత్త నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యుల అనుగ్రహం కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించి.. రెండు వర్గాలే ఉంటే ఒకరికి సర్పంచ్, మరొకరికి ఎంపీటీసీ ఇచ్చే అవకాశం ఉంది. అంతకంటే ఎక్కువ వర్గాలు ఉంటే మాత్రం ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారే అవకాశాలు ఉంటాయి.

నియోజకవర్గాల్లో వర్గ పోరు ఉంటే అది మరిన్ని ఇబ్బందులు తెచ్చి పెట్టే అవకాశం ఉంది. ఇక బీఆర్ఎస్‌లో కూడా పోటీ ఉండనుంది. పదేళ్ల అధికారంలో ఉన్న ఆ పార్టీకి కేడర్ బలం అధికంగానే ఉంది. ప్రభుత్వ పథకాల అమలు తీరులో లోపాలను పదే పదే క్షేత్రస్థాయికి ఆ పార్టీ ముఖ్యనేతలు తీసుకెళ్తున్నారు. దీంతో ఎక్కువ స్థానాలు గెలుచుకునే దిశగా పార్టీ ముఖ్యులు ఆలోచనలు చేస్తున్నారు.

బీజేపీ కూడా ఈసారి బలంగా పోటీలో నిలిచే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే స్థానిక సంస్థల్లో బలపడాలనే సిద్ధాంతాన్ని కొద్దికాలంగా బీజేపీ అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే సభ్యత్వ నమోదును ఎజెండాగా తీసుకుని పార్టీ క్షేత్రస్థాయిలోకి వెళ్లింది. బలమైన అభ్యర్థులు ఉన్న చోట త్రిముఖపోరు, లేకుంటే ద్విముఖ పోరు నెలకొనే అవకాశాలు ఉన్నాయి.

ప్రజల పాటల్లో సజీవి సుద్దాల

● సుద్దాల హనుమంతు సాంస్కృతికోత్సవాల ముగింపులో సుద్దాల అశోక్ తేజ


పాట పాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పేదలు పాడుకునే పాటల్లో, నేటి యువత జరుపుకుంటున్న ఉత్సవాల్లో సుద్దాల హనుమంతు సజీవంగా ఉన్నట్లు ప్రముఖ సినీగీత రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని బాలుర జూనియర్ కళాశాల మైదా నంలో సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల ముగింపు సమావేశం ఉత్సవాల కమిటీ జిల్లా అధ్యక్షుడు, ప్ర ముఖ న్యాయవాది బెక్కం జనార్ధన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుద్దాల హనుమంతు పుత్రుడిగా సినిమా పాటల్లో సైతం అశ్లీలత లేకుండా మానత్వాన్ని తట్టిలేపే గీతాలను రచిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఉన్న యువత దేశానికి విలువైన ఆస్తి అన్నా రు. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు.

తాను ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రోజుల్లో ఒక లంబాడీ తల్లి తన చంటిబిడ్డకు పాలకు బదులు కల్లు తాపడాన్ని చూసి చలించిపోయానని అన్నారు. రోడ్డు పనికి వెళ్లే ఆ తల్లి తన గుండెల నిండా పాలు ఉన్నా తన బిడ్డకు ఇవ్వలేక రోడ్డుపాలు చేసిన సంఘటన తన గుండెను పిండివేసిందన్నారు. ఆ సందర్భంగా తాను రాసిన గీతాన్ని ఆలపించి ఆయన కంటతడి పెట్టుకోవడమే కాకుండా నిర్వాహకులను, సభికులను కంటతడి పెట్టించారు. అనంతరం ఆయన కళాకారులు ప్రదర్శించిన కళారూపాలను తిలకించారు. కవి సమ్మేళనం, జానపద నృత్యాలు, గీతాలాపాన, బతుకమ్మ నృత్య రూపాలను ఆసక్తితో పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఇంత వైభవంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సుద్దాల రక్త సంబంధీకులను తీసుకవచ్చే వాడినన్నారు. గత రెండు రోజులుగా జరుగుతున్న కార్యక్రమ వివరాలను టీపీఎస్‌కే (తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం) రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు సభకు వివరించారు. తెలంగాణలో తొలిసారి ప్రారంభమైన ఈ ఉత్సవాలను ప్రతీ ఏటా నిర్వహించేందుకు ప్రయత్నిస్తానన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి నిర్వాహకులు జ్ఞాపికలు, మెడల్స్‌తో సత్కరించారు. ఆయా విభాగాల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి ప్రశంసా పత్రాన్ని అందించారు. డాక్టర్ మధుసూదన్ రెడ్డి, జగపతి రావు, డాక్టర్ రాంమోహన్, కుర్మయ్య, ఆర్.ప్రమోద్, వి.పద్మ, రాము, ప్రముఖ కవి వల్లభాపురం జనార్ధన్, ఖాజామైనోద్దీన్, కొప్పోలు యాదయ్య, కేపీ లక్ష్మీనారాయణ, బోల యాదయ్య, పాలమూరు యూనివర్సిటీ తెలుగు అధ్యాపకుడు ఎం.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

28 మునిసిపల్ అద్దె దుకాణాలకు తాళం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అద్దె దుకాణాలపై అధికారులు కొరడా ఝళిపించారు. ఏళ్ల తరబడి అద్దె చెల్లించకుండా ఇబ్బందికి గురిచేస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోకుండా ఉదాసీనత ప్రదర్శిస్తున్న ఆరుగురు మునిసిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. గురువారం ఏకంగా గడియారం చౌరస్తాలో 28 దుకాణాలకు తాళాలు వేశారు. రెవెన్యూ ఆఫీసర్ ఖాజామైనొద్దీన్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు బకాయి ఉన్న దుకాణాలన్నింటికి తాళాలు వేశారు. పురపాలిక పరిధిలో అద్దె దుకాణాల బకాయి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంది. మొత్తం రూ.8 కోట్లకు బకాయిలు చేరడంతో వాటి వసూళ్లపై యంత్రాంగం దృష్టి సారించింది. స్పెషల్ పాలన ప్రారంభమైన నాటి నుంచి ఓ వైపు ఆస్తిపన్ను బకాయిలు, మరోవైపు అద్దె దుకాణాల మొండి బకాయిలు వసూలే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుంది. వీటితో పాటు లీజు తీసుకున్న వ్యాపారులు కొందరు సబ్‌లీజుకు ఇచ్చి ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు. దాదాపు 5-6 దుకాణాలను గుర్తించిన అధికారులు వాటిపైనా చర్యలు తీసుకుంటున్నారు. గడియారం చౌరస్తాలో దుకాణాలకు తాళం వేయడంతో చౌరస్తా నిర్మానుష్యంగా మారింది.

తిరిగొచ్చిన తప్పిపోయిన బాలుడు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు చెందిన ఓ బాలుడు తప్పిపోగా.. మరుసటి రోజు ఫోన్ సమాచారంతో స్వస్థలానికి తిరిగొచ్చిన సంఘటన చోటుచేసుకున్నది. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీవాటి కురుమూర్తి కుమారుడు సందీప్ మం డల కేంద్రంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ బండపల్లి స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తోటి స్నేహితులు, వార్డెన్ వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం వార్డెన్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్సు స్టేషన్‌లో ఆర్టీసీ సిబ్బందితో సందీప్ తన తండ్రి కురుమూర్తికి ఫోన్ చేసి తను ఉన్న ప్రదేశాన్ని చెప్పాడు. కురుమూర్తి వరుసకు తమ్ముడు రాములు హైదరాబాద్‌లో ఉంటున్నాడు.. ఫోన్‌లో సందీప్ గురించి సమాచారం అందించాడు. రాములు సందీప్ దగ్గరకు చేరుకొని వెంటపెట్టుకొని తీసుకొచ్చాడు.

నవోదయ ప్రవేశ పరీక్షను

సజావుగా నిర్వహించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి శనివారం నిర్వహించనున్న పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ బాలుర పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్ష సూపరింటెండెంట్లు, కేంద్ర పరిశీలకులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో హాజరై పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్న నవోదయ ప్రవేశపరీక్షకు మొత్తం 5016 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల అదనపు కమిషనర్ రాజశేఖర్‌రావు, ప్రిన్సిపాల్ భాస్కర్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం

- జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డిప్యూటీ జీఎం జ్యోతిరాణి


అయిజ సింగిల్ విండో సహకారంతో నిర్వహిస్తున్న సూపర్‌మార్కెట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిరాణి

అయిజ, ఫిబ్రవరి 6: (ఆంధ్రజ్యోతి): సహకారం అందిస్తూ అభివృద్ధి సాధించటమే బ్యాంకు లక్ష్యమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డిప్యూటీ జీఎం జ్యోతిరాణి అన్నారు. బ్యాంకు సాధారణ తనఖీల్లో భాగంగా గురువారం అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. బ్యాంకు సహకారంతో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్‌ను పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలోనే అయిజ సహకార సంస్థ ఆదర్శప్రాయంగా ఉందన్నారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పురుగుమందుల విక్రయ దుకాణాన్ని పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. నష్టాల ఊబి నుంచి దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే దిశగా అయిజ సింగిల్ విండో ముందడుగు వేసిందని, చిరు వ్యాపారస్తులకు రూ.కోటి రుణాలు ఇచ్చేందుకు ముందుకురావటం గమనార్హం అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి డీసీసీబీ గద్వాల బ్రాంచి మేనేజర్ ఆంజనేయులు, అయిజ కార్యదర్శి మల్లేష్, జీవన్, భక్తప్రహ్లాద, రాజు, కళావతి, సంధ్య, భూమిక, లావణ్య పాల్గొన్నారు.


కృష్ణానదిలో విత్తనాలు విత్తుతున్న రైతులు


పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట దగ్గర పెరిగిన మొక్కజొన్న పంట

కృష్ణానదిలో సిరుల పంటలు

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎండిన కృష్ణానదిలో రైతులు సిరుల పంటలు పండిస్తున్నారు. అధిక దిగుబడులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కృష్ణానదిలో నీటి ముంపునకు గురైన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోలు, వేంకల్, మాధవస్వామినగర్ గ్రామాలలోని దాదాపు రెండువేల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రతీ ఏడాది జూన్, జూలై నెలలో కృష్ణానది నిండుగా పారుతుంది. నదిలో నీరు తగ్గాక పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురువడంతో కృష్ణానది రెండునెలల క్రితం వరకు నిండు కుండలా పారింది. ఈ మధ్యకాలంలో నీరు పూర్తిగా తగ్గుతుండడంతో విత్తనాలు విత్తుతున్నారు. ఈ మధ్య కాలంలో మల్లేశ్వరం, వేంకల్ శివారులో ఎక్కువగా వేరుశనగ, మినుములు, సాగు చేశారు. మంచాలకట్ట, జటప్రోలు శివారులలో మొక్కజొన్న, మినుము, నువ్వులు, జొన్న, శనగ, పుచ్చకాయ సాగు చేశారు. భూములు దాదాపుగా ఆరు నెలల పాటు నీటిలో మునిగి ఉండడంతో సారవంతంగా మారడంతో అధిక దిగుబడులు వస్తున్నాయి. పంటలు విత్తిన తరువాత కలుపు మొక్కలు గాని, పిచ్చి మొక్కలు గాని రావని రైతులు చెబుతున్నారు. అదే విధంగా పంట దిగుబడి కోసం ఎలాంటి రసాయనిక ఎరువులు కూడా వాడమని, సహజ సిద్ధంగానే పంటలు పండుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. మంచాలకట్ట, జటప్రోలు గ్రామాల్లో బంకమట్టి, నల్లరేగడి, భూములు ఎక్కువగా ఉండడంతో భూమిలో ఉండే తేమకే పంటలు పండుతాయి. వేంకల్, మల్లేశ్వరం గ్రామాలలోని రైతులు మాత్రం నదిలోనే బోర్లు వేసి పైపుల ద్వారా నీటిని పారపెట్టి పంటలు పండిస్తున్నారు. నదిలో భూములకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. కౌలు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు పలుకుతోంది.


మల్లేశ్వరం శివారులో వేసిన నువ్వుల పంట

రసాయన ఎరువుల అవసరం లేదు..



రసాయనిక ఎరువులు లేకుండా పంటలు సాగు చేస్తాం. మంచాలకట్ట శివారులో తేలిన పొలాల్లో ఎక్కువగా నల్లరేగడి భూములు ఉన్నాయి. ప్రతీ ఏడాది తేలిన భూములపై ఒండ్రు ఎక్కువగా పేరుకుపోవడంతో తేమ నిల్వ ఉంటుంది. పంటలు వేసిన తరువాత నీరు కట్టాల్సిన అవసరం ఉండదు.

- కొత్తశివుడు, రైతు మంచాలకట్ట

జాతీయ స్థాయి యోగా పోటీలకు క్రీడాకారులు

- 8న రిపోర్టు చేయాలని ఆదేశం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని తిరువనంతాపురంలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న 49వ జాతీయస్థాయి యోగా పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు యోగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాములు, బాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగంలో శ్రీకాంత్, ప్రకాష్, మధు, సాగర్, వెం కటేశ్, బాలికల విభాగంలో బాలమణి, స్వప్న, శ్వేత ఎంపికయ్యారు. ఈ నెల 8న ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ స్టేడియంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

భరోసా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



కేక్ కట్ చేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : భరోసా కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో భరోసా సెంటర్ పెట్టి సంవత్సరం పూర్తైనందున అడిషనల్ ఎస్పీ సీహెచ్. రామేశ్వర్ ఆధ్వర్యంలో ఎస్పీ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు భరోసా సెంటర్ ద్వారా స్టేట్‌మెంట్ రికార్డు, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. భరోసా సెంటర్ సిబ్బంది మంచిగా పని చేస్తున్నారని కొనియాడారు. అలాగే ఆపరేషన్ స్మైల్ ఆపరేషన్ ద్వారా మైనర్ బాలబాలికలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారి మీద కేసులు నమోదు చేసి చిన్న పిల్లలను భరోసా కల్పిస్తున్నామన్నారు. భరోసా కేంద్రం ఏర్పాటు చేసి సంవత్సరం అయిన సందర్భంగా భరోసా కేంద్రం సిబ్బందితో కలిసి జిల్లా ఎస్పీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్, డీసీఆర్‌బీఎస్‌పీ సత్యనారాయణ, సీఐ కనకయ్య, ఎస్ఐ గోవర్ధన్, భరోసా సిబ్బంది సఖి సెంటర్ సిబ్బంది, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

చిరుతల సంచారంతో

భయం భయం

- రాత్రివేళ బయటికి వచ్చేందుకు జంకుతున్న జనాలు
- వీధిలైట్లు లేక అంధకారం

దోమలపెంట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ అభయారణ్యంలో రోజురోజుకు పెద్దపులులు, చిరుతలు వృద్ధి చెందుతున్నాయి. అవి అటవీ సమీప గ్రామాలలోకి చొరబడి పెంపుడు జంతువులు, వీధి కుక్కలను ఎత్తుకుపోతున్నాయి. అమ్రాబాద్ మండలం దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ, వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింత బావి గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ, శ్రీశైలం డ్యాం, ఇన్‌క్లాండ్ టన్నెల్ (మత్స్యకారుల కాలనీ) పరిసర ప్రాంతాలలో నిత్యం చికటి పడిందంటే చిరుతపులులు గ్రామాలలోకి వస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. దోమలపెంట, గోవిదరాజుల కాలనీ, స్టాఫ్ క్వార్టర్స్ గ్రామాలలో ముళ్ల పొదలు దట్టంగా కముమ్ముకుపోవడంతో అటవీ జంతువులకు ఆవాసాలుగా మారాయని, వీధిలైట్లు లేకపోవడంతో గ్రామం అందకారంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అటవీ జంతువులు ఎప్పుడు దాడి చేస్తాయో అన్న భయంతో ఉన్నామని, ఇటీవల ఎస్ఎల్‌బీసీ సొరంగపు పనుల సమీపంలోకి చిరుత పులి రావడం, గతంలో ఎలుగుబంటి దాడి చేసి ఓ కార్మికుడిని గాయపర్చండం, దోమలపెంటలో దొడ్డిలో ఉన్న గేదె దూడను చంపడం, మేకలను ఎత్తుకు పోవడం జరిగిందని గ్రామస్థులు వాపోతున్నారు. చిరుతలు గ్రామాలలోకి రాకుండా అటవీ శాఖ అధికారుల చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి

మా కాలనీలో వీధి లైట్లు లేవు. రాత్రి పూట బయటకు రావాలంటేనే చిరుత పులులతో భయమేసోతంది. రోజు ఫిల్టర్ హౌస్ దగ్గర నీల్లు తాగేందుకు చిరుతలు వస్తున్నాయి. గోవింద రాజుల కాలనీలో పూర్తిగా ముళ్లపొదలు కమ్ముకున్నాయి. అధికారులు పొదలను తొలగించాలి. లైట్లు వేయించాలి.

అపరిచితులతో జాగ్రత్త

- జిల్లా షీ టీం ఇన్‌చార్జి విజయలక్ష్మి

తాడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పరిచయం లేని వ్యక్తులతోపాటు ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతీనిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ఐతోల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీం, సఖి ఆధ్వర్యంలో పోక్సో చట్టం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరలో ఉన్నప్పుడు, ఆటోలు, బస్సుల్లో ప్రయాణించేటప్పుడు మహిళలు, బాలికలు వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తెలియని వ్యక్తులు డైరెక్ట్‌గా వీడియో కాల్ చేసి మోసాలకు పాల్పడుతు న్నారన్నారు. ఇన్‌స్టా పరిచయాల ద్వారా చాలా మంది యువతీ, యువకులు తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో చాలా చోట్ల మహిళలను, విద్యార్థినులను ఎవరు వేధింపులకు గురి చేసినా వారి ఆట కట్టి స్తామన్నారు. ప్రత్యేకంగా ప్రధాన కూడలిలో చౌరస్తాలలో మండల జిల్లా కేంద్రాల్లో షీటీం పని చేస్తుందని, బాధితులు 100 లేదా 8712657676 నెంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలిపాలని కోరారు. భరోసా కేంద్రం కోఆర్డినేటర్ శ్రీలత మాట్లాడుతూ భరోసా సేవలు గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో సఖి సెంటర్ అడ్మిషన్ సునీత, పాఠశాల హెచ్ఎం కే.భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, షీటీం మెంబరు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సుంకేసుల జలాశయంలో యువకుడి గల్లంతు

» జాలర్ల సాయంతో మృతదేహం వెలికితీత


కోల్కార్ రఫీ (ఫైల్)

రాజోలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులోని సుంకేసుల జలాశయంలో గురువారం ప్రమాదవశాత్తు యువకుడు జారిపడి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలి మండల కేంద్రానికి చెందిన కోల్కార్ రఫీ (18) గురువారం మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ సరిహద్దు అయిన కేసీ కెనాల్ వైపు డ్యాం గేట్లు పైభాగంలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. కాగా ప్రమాదవశాత్తు నీటిలో జారి గల్లంతయ్యాడు. పక్కనే ఉన్న స్నేహితులు జాలర్లకు తెలపడంతో వెంటనే వారు యువకుడిని వెతికారు. అప్పటికే ఆ యువకుడు మృతి చెందాడు. ఏపీ సరిహద్దు కావడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజోలి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు. కాగా యువకుడి తండ్రి రెండేళ్ల క్రితమే మృతి చెందాడు. ఈయన ఒక్కగానొక్క కుమారుడని, ఇంటర్ వరకు చదివి రాజోలిలో చేనేత పనిచేస్తుండేవాడని కుటుంబసభ్యులు తెలిపారు.

భూతగాదాలో గాయపడిన వృద్ధుడి మృతి


కాశన్న (ఫైల్)

భూత్పూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ రామకృష్ణ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని గోప్లాపూర్ చెందిన పోతురాజు కాశన్న, అతని కుమారుడైన పోతురాజు నర్సింహులు, వీరి దాయాదులు పోతురాజు రాములు, కుమారులు పోతురాజు రాజారాం, యాదయ్య భూమి విషయంలో ఈనెల 3వ తేదీన రాత్రి గొడవపడ్డారు. ఈ ఘటనలో పోతురాజు కాశన్న(81) తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం అదే రోజు రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈయనకు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న డీసీఎం: డ్రైవర్ మృతి

ఎర్రవల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మొక్కలకు నీళ్లు పడుతున్న ట్యాంకర్‌ను డీసీఎం ఢీకొని డ్రైవర్ మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా కోదండాపురం ఎస్ఐ స్వాతి తెలిపిన వివరాల ప్రకారం.. మానవపాడు మండలంలోని నారాయణపురం స్టేజి వద్ద 44వ జాతీయ రహదారిపై మొక్కలకు నీళ్లు పడుతూ ట్యాంకర్ వెళుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం చెందిన ప్రసాద్ (45) హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు డీసీఎంతో వెళ్తుండగా ప్రమాదవశాత్తు నీళ్ల ట్యాంకర్‌ను ఢీకొన్నాడు. డీసీఎం డ్రైవర్ ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం చెందిన దొడరోళ్ల చిట్టెమ్మ(38) కుటుంబ కలహాలతో గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆ తర్వాత ఊర చెరువులో శవమై కన్పించింది. ఈ ఘటనపై మృతురాలి అన్న మెరుగు బంగారయ్య చెల్లెలి మృతిపై అనుమానం ఉందని భర్త దొడరోళ్ల శాంతయ్యపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫ్యాన్‌కు ఉరేసుకొని వ్యక్తి..

కోడేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడేరు మండల కేంద్రానికి చెందిన కావలి చిన్న రాజు (36) బుధవారం రాత్రి భార్య, కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో భార్యా, పిల్లలు అతని తల్లి ఆరుబయట మాట్లాడుతుండగా రాజు ఇంట్లోకి వెళ్లి తలుపు మూసుకున్నాడు. భార్య తలుపు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కృష్ణ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని గుడెబల్లూరు శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడెబల్లూరుకు చెందిన చెవిటోల రాఘవేంద్ర సైకిల్‌పై పొలానికి వెళ్తుండగా, లారీ ఢీ కొనడంతో రాఘవేంద్ర రోడ్డుపై పడి చెయ్యి, కాలు విరిగి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఏఎస్ఐ సురేంద్రబాబు చేరుకొని అంబులెన్స్‌లో రాయచూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

ఊర్కొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌కు చెందిన ఊరడి సుధాకర్ భార్య పుట్టినిల్లు కల్వకుర్తి మండలంలోని రాచూర్ గ్రామంలో నివాసం ఉంటూ జీవనోపాధి పొందుతున్నాడని తెలిపారు. స్వగ్రామం వెళ్లి తిరిగి రాచూర్ వస్తున్న క్రమంలో ఊర్కొండలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో బైకు ఆదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా వెంటనే కల్వకుర్తి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

కల్లు సీసాలో ఎలుక ప్రత్యక్షం

బిజినేపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కల్లు సీసాలో కట్ల పాము కళేబరం ఉదాంతం మరువక ముందే ఎలుక ప్రత్యక్షమవడంతో కల్లు ప్రియులు ఆందోళన చెందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని గుడ్లనర్వలో కల్లు దుకాణంలో ఓ వ్యక్తి ఇంట్లో శుభకార్యం ఉండడంతో ఒక పెట్టె కల్లు సీసాలు తీసుకెళ్లాడు. బంధువులకు కల్లు సీసాలు పంచాడు. సీసాను ఎత్తి తాగుతుండగా ఏదో కదిలనట్లు అనుమానం రావడంతో పరిశీలించగా చచ్చిన ఎలుక పిల్ల కనిపించింది. దీంతో సదరు వ్యక్తి భయాందోళనతో నానా హైరానా చేశాడని గ్రామస్థులు వాపోయారు. ఇదేమని కల్తీ కల్లు తయారు చేసిన వ్యాపారిని గ్రామస్థులు నిలదీయడంతో ఏమీ చేయాలో పాలుపోని యజమాని మిన్నకున్నాడు. వెంటనే కల్లు విక్రయించకుండా దుకాణం మూసి వేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతోనే గ్రామాల్లో కొందరు వ్యాపారులు కృత్రిమంగా కల్తీకల్లు తయారు చేసి విక్రయిస్తున్నారని విమర్శించారు.


విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

కృష్ణ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు కౌసు మొగుళప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున గుడిసెలో షార్ట్ సర్క్యూట్ వల్ల నిప్పురవ్వ కిందకు పడింది. దీంతో బయటికి పరుగెత్తేలోపే మంటలు చెలరేగాయి. రూ.40వేల నగదుతో పాటు సామగ్రి కాలి బూడిదైందని వాపోయాడు. తహసీల్దార్ వెంకటేశ్ పంచనామా నిర్వహించారు.

ప్రకృతి రమణీయం అంజన గిరి

» ఆహ్లాదం, ప్రశాంతతకు నిలయం
» గట్టుకాడిపల్లి అంజనగిరి క్షేత్రంలో స్వయంభువుగా వేంకటేశ్వర స్వామి
» ఈనెల 8 నుంచి 13 వరకు బ్రహ్మోత్సవాలు
» భారీగా తరలిరానున్న భక్తులు


గట్టుకాడిపల్లి అంజనగిరి క్షేత్ర వేంకటేశ్వర స్వామి ఆలయం


గుట్టపై స్వయంభువుగా వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని గట్టుకాడిపల్లి, అంజనగిరి క్షేత్రంలో స్వయంభువుగా వెలిసిన లక్ష్మీ అలర్మేల్ మంగ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 8 మాఘశుద్ధ ఏకాదశి నుంచి 13వ తేదీ పాడ్యమి వరకు నిర్వహించనున్నారు. ఆలయం గాలిగోపురం ముందు భాగంలో 108 కట్టెలతో పచ్చని పందిరి వేసి వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య స్వామి వారి కల్యాణం, విద్యుత్ కాంతుల మధ్య రథోత్సవం బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మూడేళ్లుగా ఏడు కొండల వాసుడు తిరుమల వేంకటేశ్వర స్వామిని ప్రతి నెల 7వ తేదీన భక్తులు దర్శించుకునే విధంగా ఉమ్మడి జిల్లా భక్తులు ప్రతి నెలా 7వ తేదీన అంజనగిరి క్షేత్ర వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయంలో అఖండ భజనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

ఎన్నికలకు సెంటిమెంట్

అంజనగిరి వేంకటేశ్వర స్వామి ఆలయం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలకు పూజలు చేయడం సెంటిమెంట్‌గా మారింది. 2018 ఎన్నికల్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నామినేషన్ పత్రాలకు పూజ చేయించి మొదటి సారి వనపర్తి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2023 ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి సైతం నామినేషన్ పత్రాలకు ఇక్కడే పూజలు నిర్వహించి ఎన్నిక కావడంతో ఈ క్షేత్రం ఎన్నికలకు సెంటిమెంట్‌గా మారింది. ఈ ప్రాంతంలో ప్రజలు మంచి పనులు ప్రారంభించే ముందు ఆలయంలో పూజలు చేయిస్తారు. 8 ఏళ్లుగా ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవం ఎమ్మెల్యే మేఘారెడ్డి, రథోత్సవంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సుదర్శన హోమంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొననున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

8న స్వామి వారికి క్షీరాభిషేకం, కోవిల్ అల్వార్ తిరుమంజసం, రుత్విగరణం, యాగశాల ప్రవేశం, అంకురార్పణం, 9న ధ్వజారోహణం, సింహ వాహన సేవ, భేరి పూజ, దేవతాహ్వానము, గరుడ సేవ, ఎదుర్కోలు, ఈనెల 10న కల్పవృక్ష వాహనం సేవ, తిరుకళ్యాణ మహోత్సవం, పుష్ప యాగం, పుష్పరథం, హనుమంత సేవ, ఈనెల 11న గజ వాహనం మహా సుదర్శన హసనము, హంస వాహనం, 12న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, అర్ధరాత్రి రథోత్సవం, 13న అశ్వ వాహనం, శేష వాహనం, ధ్వజారోహణం, సప్తా వరణాలు, రుత్వికులకు సన్మానం, సప్తవరణాలు, వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు ఉంటాయి.


వేంకటేశ్వర స్వామి మూలవిరాట్

అబద్ధపు హామీలతో అధికారంలోకి..

» కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారు
» రైతుదీక్షకు కేటీఆర్ రాక
» కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కజైపాల్‌యాదవ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులు అవుతున్నా ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో 50శాతం ఉన్న బీసీ జనాభాను ప్రభుత్వం కుల గణన సర్వే పేరుతో 42శాతానికి తగ్గించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు పర్చాలని బీసీల జనాభా లెక్క తేల్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ లో వెంటనే కుల గణన బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు.

13న ఆమనగల్‌లో రైతుదీక్ష

నియోజకవర్గంలోని ఆమనగల్‌లో 13న రైతు దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నట్లు తెలిపారు. దీక్షకు నియోజకవర్గంలోని రైతులు, అన్ని వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పల వెంకటేశ్, ఎడ్మసత్యం, విజితారెడ్డి, సింగం విజయ్‌గౌడ్, అర్జున్‌రావు, కొండూరు గోవర్ధన్, వట్టెపు బాలయ్య, మధు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై పోరాడుదాం

» పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి


మాట్లాడుతున్న రాఘవాచారి

మరికల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజా సంఘాలు, ప్రతిపక్షపార్టీలతో కలిసి పోరాటాలు చేయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి పిలుపు నిచ్చారు. గురువారం నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని యువక మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట జిల్లాలో నిర్మించాల్సిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నాగర్‌కర్నూల్ జిల్లాకు తరలించారన్నారు. అప్పుడు మన నాయకులు గొంతెత్తలేకపో యారన్నారు. ఇప్పుడు మన జిల్లాకు అందుతున్న అతి తక్కువ నీటిని కూడా దక్కకుండా జీవో నెంబర్ 11ద్వారా ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి ఎత్తిపోసి నల్గొండ జిల్లాకు తరలించుకుపోతున్నట్లు తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మొత్తం 90 టీఎంసీలు ఫేజ్-1, ఫేజ్-2గా విభజించి మొదటి ప్లాన్ ప్రకారం ఫేజ్-1 కింద 45 టీఎంసీల నీటిని నారాయణపేట - కొడంగల్ ప్రాంతానికి కేటాయించాలన్నారు. జూరాల నుంచి కోయిల్‌సాగర్ వచ్చే రెండు టీఎంసీల నీటిలో దాదాపు టీఎంసీ నీరు ఇథనాల్ కంపెనీ తీసుకుంటున్నట్లు తెలిపారు. డిండికి తరలించే నీటిని అడ్డుకోకపోతే మిగిలిన ఒక టీఎంసీ నీరు కూడా కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు రావన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలకు డిమాండ్‌లు వినిపించి వారి ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్దామన్నారు. పోరాడి సాధించుకున్న పాలమూరు - రంగారెడ్డి ఎత్తి పోతల పథకాన్ని రీడిజైన్ పేరుతో ప్రతిపాదిత స్థలాన్ని ఏకంగా జూరాల ఎగువ నుంచి 90 మీటర్ల దిగువకు శ్రీశైలం ప్రాజెక్టులోకి మార్చినట్లు తెలిపారు. దీని ద్వారా ఏపీకి కృష్ణానది మీద అటువైపు లక్ష క్యూసెక్కులకు పైగా తరలించుకుపోయే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వెంకట్రాములు, సుదర్శన్, అడ్వకేట్ అయ్యప్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అదృష్టాన్ని చెరిపేశారు


దౌదర్‌పల్లి వద్ద డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయం

గద్వాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లక్కీడిప్‌లో పేర్లు వచ్చిన లబ్ధిదారుల అదృష్టాన్ని అధికారులు చెరిపేశారు. లక్కీడిప్‌లో ఇళ్లు తగిలిన 84 మంది లబ్ధిదారులకు అధికారులు షాక్ ఇచ్చారు. మీ పేర్లపై ఇదివరకే ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయని, సొంత ఇల్లు కలిగిన మీరు డబుల్ బెడ్రూం ఇళ్లకు అనర్హులంటూ.. వారి పేర్లను జాబితా నుంచి తొలగించారు. దీంతో గద్వాలలో డబుల్ బెడ్రూం ఇళ్ల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. రెండుసార్లు ఇంటింటికి తిరిగి విచారణ చేసినప్పుడు కనిపించలేదా అంటూ బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం నాయకులు ఫైర్ అవుతున్నారు. ఇప్పటికే వారు కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చి పేర్లను తొలగించకూడదని సూచించారు. లేదని ముందుకు వెలితే బాధితులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల కథ ..

గద్వాల జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లి దర్గా వద్ద నిర్మించిన 1,275 డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుల కోసం 2023లో దరఖాస్తులు స్వీకరించారు. దాదాపు 4,200 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రతీ వార్డుకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి విచారణ జరిపించారు. ఆ తర్వాత మార్చి 25వ తేదీన వార్డు సభలను పెట్టి అర్హుల జాబితాను ప్రకటించారు. అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ ప్రతీ వార్డులో గందరగోళం ఏర్పడింది. దీంతో కలెక్టర్ మరో సారి దరఖాస్తుకు అవకాశం ఇచ్చింది. మళ్లీ 989 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 5,189 దరఖాస్తులపై మరో సారి విచారణ చేయించి పక్కాగా అర్హుల జాబితాను తయారు చేశారు. ఇలా రెండు సార్లు విచారణ చేశారు.

84 పట్టాలు రద్దు చేసిన అధికారులు

అర్హులైన జాబితాలో రిజర్వేషన్ వార్డుకు కొన్ని ఇళ్ల చొప్పున ఏప్రిల్ 15వ తేదీన లక్కీ డిప్ తీశారు. ఇందుకోసం రెండు వార్డులకు ఒక టీమ్ చొప్పున ఉదయం, మధ్యాహ్నం డిప్పు తీసేవిధంగా పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తుతో డిప్పును తీశారు. 1,275 ఇండ్లకుగాను 771 ఇళ్లకే డిప్పు తీశారు. మిగిలిన 504 ఇళ్లను ఆసుపత్రి నిర్మాణం, డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు స్థలంలో కల్పోయిన వారికి కేటాయించారు. ఇప్పుడు డిప్పులో ఇళ్లు పొందిన 771 మందిలో 84 మంది డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు అర్హులు కాదని తేల్చేశారు. ఇందులో దాదాపు 72మంది ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు పొందినవారే ఉన్నారని అధికారులు గుర్తించారు. మిగిలిన వారు ఇతర ప్రాంతాల వారు, కుటుంబం రెండు చోట్ల ఇళ్లు పొందిన వారు ఉన్నారు.

ఇళ్లు లేనివారి పేర్లనే..

లక్కీడిప్పులో తగిలి ఇళ్లు కోల్పోయిన 84 మందికి ఇండ్లు లేవని, వారందరు అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారని ప్రతిపక్షనాయకులు అంటున్నారు. విచారణ సందర్భంలో వారికి ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయని ఎందుకు గుర్తించలేదని ప్రశ్నిస్తున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు సక్రమంగా జరగలేదని, ఇళ్ల కోసం, పెన్షన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఆధార్ నెంబర్లతో మధ్య దళారులు బిల్లులు పొందారని ఆరోపిస్తున్నారు. అక్కడ ఇందిరమ్మ ఇల్లు రాలేదు. ఇక్కడ వచ్చిన డబుల్ బెడ్రూం ఇళ్లు రద్దు చేస్తే వారి పరిస్థితి ఏమిటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. పారదర్శకంగా జరిగిన కేటాయింపులో చిచ్చు పెట్టవద్దని లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

అద్దె ఇంట్లో ఉంటున్నా..



నా కుటుంబ అద్దె ఇంట్లో ఉంటుంది. నేను ఎప్పుడు కూడ ఇందిరమ్మ ఇల్లు తీసుకోలేదు. నేను ఇందిరమ్మ బిల్లు తీసుకున్నట్లు చూపించి నాకు డిప్పులో తగిలిన ఇంటిని రద్దు చేశారు. అధికారులు నా ఇంటికి వచ్చి విచారణ చేయాలి.

- వడ్ల నాగేశ్వరమ్మ, 36వ వార్డు, గద్వాల

విచారణలో గుర్తించలేదా?



అధికారులు రెండు సార్లు విచారణ చేశారు. అప్పుడు వీరికి ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయా లేదా అని గుర్తించలేకపోయారా..! ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయని అంటున్నారు. తొలగించిన వారందరికి ఇళ్లు లేవు. వాళ్ల పేర్లపై బోగస్ బిల్లులు ఎత్తి ఉంటారు. అధికారులు న్యాయం చేయాలి లేదంటే లబ్ధిదారులతో కలిసి పోరాటం చేస్తాం.

- రజక జయశ్రీ, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు గద్వాల

అత్యాశకు పోయి.. మోసపోయిన యువకుడు

చారకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అత్యాశకు పోయి మోసపోయిన ఘట న నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శంషోద్దీన్ తెలిపారు. మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన ఎండీ ఖదీర్‌కు, ఎండీ రియాజ్ డెకాథ్లాన్ మొబైల్ యాప్‌లో పెట్టుబడి పెడితే రోజుకు రూ. 4వేల చొప్పున సంపాదించవచ్చని నమ్మించాడు. అత్యాశకు పోయిన ఖదీర్ గత నెల 11న రూ. 69 వేలు పెట్టుబడి పెట్టాడు. 14న ట్యాక్స్ కార్డుకు రూ.9,500 క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించాడు. పెట్టుబడి పెట్టిన మరుసటి రోజు నుంచే యాప్ పనిచేయకపోవడంతో రియాజ్ మాటలు నమ్మి మోసపోయినట్లు గ్రహించాడు. వెంటనే 1930 సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు. అనంతరం బాధితుడు ఖదీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిజాయతీ చాటుకున్న పోలీస్ పెట్రోల్‌బంక్ సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పోలీస్ వెల్ఫేర్ సొసైటీ వారి పెట్రోల్‌బంక్ సిబ్బంది నిజాయితీని చాటు కున్నారు. నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం చెందిన శ్రీనివాస్ తన వాహనానికి బుధవారం సాయంత్రం రూ.9,400 డీజిల్ వేయించారు. ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించే క్రమంలో పొరపాటుగా రూ.93,400 చెల్లించారు. శ్రీనివాస్ ఇంటికి వెళ్లి సరి చూసుకుని, పొరపాటును ఎస్ఐ గౌస్‌పాషకు సమాచారం అందించారు. అదనంగా చెల్లించిన డబ్బులను శ్రీనివాస్‌కు ఎస్ఐ, సిబ్బంది ఆధ్వర్యంలో అందించారు.

కట్టేసిన మేకపై చిరుత దాడి

» నవాబ్‌పేట మండలం కొండాపూర్‌లో ఘటన

నవాబ్‌పేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో మరోసారి కట్టేసిన మేకపై చిరుత దాడి చేయడం ఆందోళన కల్గించింది. గ్రామానికి చెందిన కర్రె వెంకటయ్య పొలంలో బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తన వ్యవసాయ పొలంలో వేసిన వేరుశనగ పంటకు కాపలాగా వెళ్లి నిద్రిస్తుండగా తన మేకపై చిరుత దాడి చేసి దూరం తీసుకెళ్లి చంపివేసిందని బాధితుడు వాపోయాడు. కేకలు వేయగా చిరుత మేకను వదిలి పారిపోయిందన్నాడు. కట్టేసిన మేకపై చిరుత దాడి చేయడం మండలంలో కలకలం రేపింది. అయితే చిరుతల సంచారంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల్లోకి చిరుత రావడంతో రైతులు తమతమ పంట పొలాల్లోకి కాపలా వెళ్లడం మానేశారు.

జాతీయ నెట్‌బాల్ పోటీల పరిశీలకుడిగా రామ్మోహన్‌గౌడ్




మహబూబ్‌నగర్ స్పోర్ట్స్/ ధన్వాడ , ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్‌లో శుక్రవారం నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ పరిశీలకుడిగా జిల్లా కేంద్రానికి చెందిన పీడీ రామ్మోహన్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ మేరకు నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు సుమన్ కౌశిక్, విజయేందర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నెట్‌బాల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్యరెడ్డి, ఖాజాఖాన్ అభినందించారు.

రాష్ట్ర జట్టుకు కోచ్‌గా రాము



కల్వకుర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : డెహ్రాడూన్‌లో కు జరుగుతున్న 38వ జాతీయ క్రీడలకు రాష్ట్ర నెట్‌బాల్ టీం కోచ్‌గా వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రాము ఎంపికయ్యారని నెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విక్రమ్ ఆదిత్యరెడ్డి తెలిపారు. కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామ వాసి అయిన జి.రాము జాతీయ క్రీడల కోచ్‌గా నియామకమైనందున గ్రామ ప్రజలు అభినందించారు.

సదా మీ సేవలో..



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

గద్వాల జిల్లా	:9985404383
మహబూబ్‌నగర్ జిల్లా	: 8096677362
నాగర్‌కర్నూల్ జిల్లా	:8374394441
నారాయణపేట జిల్లా	:9985456557
వనపర్తి జిల్లా	:9010937550

పత్రిక పంపిణీలో ఏవైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.
సర్క్యులేషన్ మేనేజర్: 9985411170

న్యూస్ బాక్స్

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యసిబ్బంది

ఇటిక్యాల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కుష్ఠు, హెచ్ఐవీ వ్యాధులు అంటువ్యాధులు కావని వివిధ వైరస్ వల్ల సోకుతాయని లెప్రా ఇండియా సంస్థమెంటర్ మల్లికార్జున్ అన్నారు. గురువారం ఇటిక్యాల జడ్పీ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యాధి నివారణకు సరైన మార్గాలు, పద్ధతులు పాటించాలంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇటిక్యాల ప్రాథమిక వైద్యులు రాధిక, హెచ్ఎం సురేష్, పాగుంటన్న, వైద్యసిబ్బంది శేఖర్, నాగమ్మ, రమేష్ పాల్గొన్నారు.

దుమ్ముతో ఇక్కట్లు

వడ్డేపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ నుంచి రామాపురం, రాజోళికి వెళ్లే దారులపై దుమ్ము రేగడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై కంకరపరిచి సంవత్సరం కావస్తున్నా సంబంధిత అధికారుల స్పందించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న కుటుంబాల వారు దుమ్ముకు తాళలేక అనారోగ్యాలకు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని ప్రజలు చెబుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్లను ప్రశ్నిస్తే బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులను అర్ధంతరంగా నిలిపివేశామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

చదువుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

● న్యాయాధికారి గంట కవితాదేవి

● రేవులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు

ధరూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి జీవితంలో చదువు ఎంతో ముఖ్యమని, విద్యార్థి దశలో సమయాన్ని వృథాచేయకుండా ఏకాగ్రతతో చదివి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని రేవులపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అంతకుముందు న్యాయాధికారిని పాఠశాల బృందం సన్మానించారు. అనంతరం పాఠశాలలో నూతన భవనం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు న్యాయాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఆది మాల్లారెడ్డి, కాంప్లెక్స్ ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు గౌరీశంకర్, తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు గద్వాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గద్వాలఅర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ 33/11కేవీ టౌన్-2 ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, పాత ఏబీ స్విచ్‌లను మార్చడం ఉన్నందువల్ల శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 8.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గంజిపేట, చెనుగోనిపల్లిరోడ్డు, బురదపేట, గాంధీచౌక్, రాజవీధి, గంటవీధి, షేరెల్లివీధి, సుంకులమ్మ మెట్టు ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

అయిజటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అయిజలోని అక్షర ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని గురువారం విద్యార్థులు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో పదవతరగతి చదివే విద్యార్థుల్లో కలెక్టర్‌గా రాంచరణ్, డీఈవోగా విష్ణు, ఎంఈవోగా నరేష్, ప్రిన్సిపాల్‌గా సురేష్‌గౌడు, ప్రధానోపాధ్యాయుడుగా వెంకటేష్, పీఈటీలుగా స్రవంతి, సుస్మిత, సూరి వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గద్వాల క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చింతలపేటకు చెందిన నవీన్ గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నవీన్(25) ఇటీవలే ఓ ట్రాన్స్‌జెండర్‌ను ప్రేమ పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పడంతో తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపానికి గురై రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై గాయాలు ఉండడం పలుఅనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు.

గుర్తింపు పొందిన ఉత్పత్తులనే కొనాలి

● అదనపు కలెక్టర్ నర్సింగరావు

● బీఐఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాలన్యూటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రామాణికంగా గుర్తింపు పొందిన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో బీఐఎస్ కేర్ యాప్ ద్వారా సంబంధిత రంగాలకు సంబంధించిన ప్రమాణాలను తెలుసుకోవడం, డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని పి.వి. శ్రీకాంత్ డైరెక్టర్, హెడ్, డైరెక్టర్ తమ్మడి సుజాత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రామాణిక ఉత్పత్తుల నాణ్యత తనిఖీలు, మార్కెట్‌లోని నాసిరకం ఉత్పత్తులను నియంత్రించే చట్టాల గురించి జిల్లాలోని అధికారులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలను మరింతగా అనుసరించి, నాణ్యమైన ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. బీఐఎస్ యాప్ వినియోగదారులకు ఉత్పత్తుల ప్రమాణాలు, హాల్మార్క్, లైసెన్స్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్లను సులభంగా తనిఖీ చేయగలుతుతుందన్నారు. ఈ యాప్ ద్వారా వినియోగదారులు నాణ్యమైన ఉత్పత్తులను ఎంపిక చేసుకోగలరని, అలాగే నాణ్యత లోపం, దుర్వినియోగం గురించి ఫిర్యాదు చేయవచ్చన్నారు. బీఐఎస్ కేర్(సీఐఆర్‌ఈ)యాప్ వినియోగదారుల హక్కులను రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ రైస్ డెలివరీని వెంటనే పూర్తి చేయాలి

రాష్ట్రంలో ఖరీఫ్ 2024-25 పంటకు సంబంధించిన సీఎంఆర్ రైస్ డెలివరీని వెంటనే పూర్తిచేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ, కంజ్యూమర్ అఫైర్స్, ఫుడ్, సివిల్ సప్లై, కమిషనర్ ఆఫ్ సివిల్ సప్లై డీఎస్. చౌహాన్ అధికారులకు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్‌లతో సీఎంఆర్ డెలవరీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఖరీఫ్ 2024-25కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలవరీలను త్వరగా పూర్తి చేయాలని సంబంధింత సివిల్ సప్లై అధికారులకు ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లులో నిలువ ఉంచిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఖరీఫ్ 202425 పంటకు సంబంధించి ఇప్పటివరకు ఇవ్వని బ్యాంకు గ్యారెంటీలను బ్యాంకు మేనేజర్‌లతో మాట్లాడి త్వరగా తెప్పించకోవాలన్నారు. క్వాలిటీ గల సన్నబియ్యాన్ని సమర్థవంతగా డెలవరీ చేయించుకోవాలన్నారు.

రబీ 2024-25 పంటకు సంబంధించి, అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్టర్, ప్యాడీక్లీనర్లు, గన్నీ బ్యాగులు వంటి ప్రాథమిక వనరులను ముందుగా సమకూర్చుకోవాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఐడీవోసీ నుంచి అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఎస్‌వో స్వామికుమార్, జిల్లా మేనేజర్ విమల తదితరులు ఉన్నారు.

సజావుగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు



పుల్లూరు బాలికల కళాశాలలో విద్యార్థినుల ప్రయోగ పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఈవో హృదయరాజు

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ జనరల్, వృత్తివిద్య ప్రయోగ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ఆరవ రోజూ సజావుగా కొనసాగాయి. గురువారం జరిగిన పరీక్షలను డీఐఈవో, పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు పరిశీలించారు. గద్వాలలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల పుల్లూరులోని జోత్యిబా పూలే బీసీ బాలికల గురుకుల విద్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు చేస్తున్న ప్రయోగాలను పరిశీలించారు. అనంతరం పరీక్షా కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాట్లపై సీవో, డీవోల ద్వారా ఆరా తీశారు. ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా ఉదయం జరిగిన జనరల్ ప్రయోగ పరీక్షలకు 295 మందికి 282 (96 శాతం) మంది, వృత్తి విద్యా ప్రయోగ పరీక్షలకు 130మందికి 125 (96శాతం) మంది విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన జనరల్ ప్రయోగ పరీక్షలకు 130మంది విద్యార్థులకు గాను 126 (97 శాతం) మంది, వృత్తి విద్యాప్రయోగ పరీక్షలకు 288మంది విద్యార్థులకుగాను 270 (94 శాతం) మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.

ఆరు గ్యారెంటీలకు మంగళం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజటౌన్, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల తరువాత హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడుతుందని గద్వాల జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం అయిజలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి డి.కె స్నిగ్ధారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అమలు చేయలేని హామీలను గత అసెంబ్లీ ఎన్నిల్లో ప్రజలకిచ్చి కాంగ్రెస్ నాయకులు పదవులు పొందారని దుయ్యబమట్టారు. రానున్న సర్పంచు, ఎంపీటీసీ ఎన్నికల కంటే ముందే అప్పట్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతీ మహిళ అకౌంట్లో రూ.2,500లు జమచేస్తామని చెప్పిన ప్రభుత్వం 12నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. పక్కపార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవటంపైనే శ్రద్ధ చూపుతున్నారని విమర్శించారు. తెలంగాణ రైతులకు పెట్టుబడి సాయం అందించకుండా కాలయాపన చేయటంలో అంతర్యమేమిటో ప్రజలకు వివరించాలన్నారు. రానున్న జమిలీ ఎన్నికల్లో తెలంగాణలో ప్రజలు బీజేపీకి పట్టం కట్టడం తథ్యమన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, లక్ష్మన్‌గౌడు, లడ్డు రాజు, కృష్ణంరాజు, భగత్‌రెడ్డి ఉన్నారు.

ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

● మునిసిపల్ రెవెన్యూ అధికారి రాజేష్



షాపుల వద్ద పన్ను వసూలు చేస్తున్న మునిసిపల్ అధికారులు

గద్వాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు, ఇళ్ల యజమానులు ఆస్తి పన్నును విధిగా చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కార్యాలయం రెవెన్యూ అధికారి రాజేష్ కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణంలో బిల్ కలెక్టర్లు చేపట్టిన ఆస్తి పన్నువసూలు కార్యక్రమాన్ని గురువారం ఆర్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా యజ మానులతో మాట్లాడిన ఆర్‌వో సకాలంలో పన్నులు చెల్లించి సిబ్బంది సహకరించాలని కోరారు. గురువారం ఒక్కరోజు రూ.8లక్షల వరకు పన్ను వసూలైనట్లు ఆర్‌వో తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, బిల్‌కలెక్టర్లు ఉన్నారు.

త్రిఫ్టు ఫండ్ పథకం మగ్గానికి ముగ్గురికి అవకాశమివ్వాలి

● తహసీల్దార్ కార్యాలయంలో చేనేత కార్మికుల నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మికులు

రాజోలి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత త్రిఫ్టఫండ్ పథకం ఒక్కో జియోట్యాగ్‌కు ముగ్గురు సభ్యులకు లబ్ధిచేకూరే విధంగా పథకం అమలు చేయాని డిమాండ్ చేస్తూ గురువారం చేనేత కార్మికులు రాజోలి తహసీల్దార్ కార్యాలయం నందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ... ఒక కుటుంబంలో భార్య భర్త, ఇంటి పెద్దలు ఉన్న వారిలో ఒకరు నష్టపోయేందుకు అవకాశం ఉందని, గతంలో మాదిరి ఈసారి కూడా ఒక్కో జియోట్యాగ్‌కు 3 చేనేత కార్మికులకు త్రిఫ్టఫండ్ అమలు అయ్యే విధంగా చూడాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ చేనేత కార్మికులు దూళ్ల రాముడు, నారాయణ, నాగరాజు, రాము, మహిళ చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటను సందర్శించిన మాజీ మంత్రి

గట్టు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మిట్టదొడ్డి గ్రామ శివారులోని రైతు నరసింహారెడ్డి సాగు చేసిన ఆయిల్‌పాం తోటను మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి గురువారం సందర్శించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని ఇస్తుందన్నారు. పంట వచ్చే సమయంలో రెండు నెలలు చెట్లకు నీరు పుష్కలంగా ఉండాలని రైతుకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బాసు హన్మంతునాయుడు సోదరుడు కాబోయో నూతన వధువరుడు బాసు గోపాల్‌ను నిరంజన్‌రెడ్డి గురువారం బల్గెరలో కలిశారు. నూతన దుస్తులు అందించి ఆశీర్వదించారు.

మారుమోగిన అంజన్న నామస్మరణ

ధరూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం.. అంటూ భక్తుల నామస్మరణతో మండలంలోని పెద్దచింతరేవులలో ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలు మారుమోగాయి. గ్రామంలో ఆంజనేయస్వామి బ్రహోత్సవాలు ఆరవ రోజు గురువారం విశేషపూజలు చేశారు. అనంతరం బాజాభజంత్రీలు, మేళతాళాల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహానికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఉత్సవాలను ఆలయ వంశీయులతో పాటు కార్యనిర్వహణాధికారి కవిత పర్యవేక్షించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) గంటా కవితాదేవి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాయకులు రామాంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి, క్రిష్ణవేణి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

హామీని అమలుచేయడంతో కాంగ్రెస్ విఫలం



డీఎంహెచ్‌వో సిద్దప్పకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

గద్వాలన్యూటౌన్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు వెంటనే పరిష్కరించా లని రెండో ఏఎన్ఎంలు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు మాట్లాడుతూ గత ఏడాది 2024 సెప్టెంబర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 2వ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని నిరవధిక సమ్మె చేశామని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర నాయకులు సమ్మె శిబిరానికి వచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు.ఇప్పటికైనా స్పందించాలని కోరారు. ఈనెల 17న చేపట్టనున్న నిరవధిక సమ్మెకు సంబంధించిన నోటీసుతో పాటు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్పకు అందజేశారు. కార్యక్రమంలో పద్మ, నారాయణమ్మ, మాధవి, మార్త, పార్వతి, సుధారాణి, కిష్టమ్మ ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి

మానవపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నుంచి సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా చిన్నారులకు అందించాలని తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతిరోజు సమయపాలన అనుసరించి కేంద్రాలు తెరవాలని, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని చెప్పారు. రికార్డులు పరిశీలించారు. అలాగే స్థానిక మీసేవా కేంద్రాలను పరిశీలించారు.

చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలో పిల్లల భద్రత, పోషణ, ఆరోగ్య, విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం ఐడీవోసీ సమావేశపు హాలులో ఆరోగ్య శిక్షణ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలను బలోపేతం చేయడం ద్వారా పిల్లల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించవచ్చాన్నారు. బాల్య వివాహాల నిరోధం అత్యంత ముఖ్యమని, 18 సంవత్సరాలు నిండే వరకు ఆడపిల్లలు, 21 సంవత్సరాలు నిండే వరకు మగపిల్లలు వివాహం చేసుకోవద్దనే అవగాహన తల్లిదండ్రులకు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా గట్టు, కే.టి.దొడ్డి మండలాల్లో అవగాహన కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని చెప్పారు. 15నుంచి 18 ఏళ్ల వయస్సు కీలకమైన దశ కావడంతో, ఈదశలో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, యూనిసెఫ్ స్టేట్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, ఏపీడీ నర్సింహులు, గ్రామ సంఘాల ప్రతినిధులు, సహాయకులు ఉన్నారు.

పక్కాగా డిజిటల్ క్రాప్ బుకింగ్



డిజిటల్ క్రాప్ యాప్‌లో పంట వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఏవో, ఏడీలు

- జిల్లా వ్యవసాయ అధికారి సక్రియనాయక్

గద్వాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పంటసాగు వివరాలను డిజిటల్ రూపంలో పక్కాగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియనాయక్, ఏడీ సంగీతలక్ష్మి చెప్పారు. గురువారం మండల పరిధిలోని జమ్మిచేడు, వీరాపురంలో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ బుకింగ్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. వీరివెంట ఏఈవోలో ప్రవళిక, రవికుమార్, రైతులు ఉన్నారు.

అభ్యాస దీపికను సద్వినియోగం చేసుకోవాలి



అభ్యాస దీపిక పుస్తకాలు అందజేస్తున్న రమేష్‌బాబు, రెహమాన్

● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థద్వారా అందిన అభ్యాస దీపికతో మెరుగైన ఫలితాలను సాధించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు సూచించారు. పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పదవ తరగతి విద్యార్థినీలకు యూత్ వెల్ఫేర్ తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో తయారు చేసిన అభ్యాస దీపక పుస్తకాలను గురువారం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడిన రమేష్‌బాబు, విద్యార్థులు వార్షిక పరీక్షలకు సమాయత్తం కావాలన్నారు. పరీక్షలపై ఒత్తిడి, ఆందోళనకు గురికావద్దని, స్వచ్ఛంద సంస్థ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భవానీ, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రెహమాన్, జిల్లా నాయకుడు రెహ్మతుల్లా ఉన్నారు.

ఆర్డీ ఖాతాల కోసం కేవైసీ చేయించాలి

రాజోలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న త్రిఫ్ట ఫండ్ పథకానికి అవసరమయ్యే ఆర్డీ-1, ఆర్డీ-2 ఖాతాలు తెరవాలంటే ముందుగా తమ సేవింగ్ ఖాతాలకు కేవైసీ తప్పక చేయించుకుకోవాలని రాజోలి యేనియన్ బ్యాంక్ మేనేజర్ అన్నారు. రాజోలిలోని చేనేత సహకార సంఘంలో గురువారం చేనేత కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. బ్యాంకులో ఖాతా ఉన్న వారిలో చాలామంది రెగ్యులర్‌గా ఖాతాను ఉపయోగించని వారికి కేవైసీ ఉండదని, లేనివారు తప్పకుండా కేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం ఇన్‌చార్జి అధ్యక్షుడు శ్రీనివాసులు, డైరెక్టర్ మాబు, రాజోలి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దస్తగిరి, హసాన్, వంక మహేష్, కార్మికులు పాల్గొన్నారు.

యూపీఎస్‌పై యుద్ధం మొదలైంది

అలంపూరు ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్ విధానాన్ని సంఘాలకు అతీతంగా సంఘటితంగా వ్యతిరేకించేందుకు యూపీఎస్‌పై యుద్ధం మొదలైందని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. గురువారం అలంపూరులోని బాయ్స్ హైస్కూల్‌లో జిల్లాశాఖ ఆధ్వర్యంలో మార్చి 2న బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సహఅధ్యక్షుడు విష్ణు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి రమేష్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఎర్రవల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. ఇటిక్యాల ఏఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. ఎర్రవల్లి మండలంలోని 44వ జాతీయ రహదారిపై వీఎస్‌టీ కంపెనీ దగ్గర గురువారం తెల్లవారుజామున అక్రమ ఇసుకతో గద్వాలకు వెళ్తున్న టిప్పర్‌ను గుర్తించిన పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ మహేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

భవన నిర్మాణ కార్మికులు లేబర్‌కార్డు పొందాలి

- జిల్లా కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్



భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్

కేటీదొడ్డి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు ఇతర రంగాలలో పనిచేసే కార్మికులు లేబర్ కార్డును పొందాలని జిల్లా కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని వెంకటాపురంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో భవన ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేసే కార్మికులకు లేబర్ కార్డులు, కార్డులు ఉన్నవారు రెన్యువల్ చేసుకోవడం, హెల్త్‌కార్డు యొక్క ప్రాముఖ్యత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్మికశాఖ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ 18 నుంచి 59 సంవత్సరాలలోపు వయస్సు గల భవన ఇతర నిర్మాణ రంగాల్లో పని చేసే తాపీమేస్త్రీ, పేయింటర్, కార్పెంటర్, ఇతర 50 రకాల బిల్డింగ్ కార్మికులు లేబర్ కార్డులు పొందడానికి అర్హులని తెలిపారు. అర్హత ఉన్న వారు మీసేవ కేంద్రంలో రూ.110 చెల్లించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా లేబర్ కార్యాలయం దగ్గర లేబర్ కార్డులను పొందాలని సూచించారు. లేబర్ కార్డులు చేయిస్తామని మధ్యవర్తులు, దళారులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని, కార్డులు చేయిస్తామని అక్రమంగా డబ్బులు వసూలు చేసేవారిపై స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకుడు మోహిన్‌పాష, కార్మికులు రంగస్వామి, రవి పాల్గొన్నారు.

● సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

ధరూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భవన, ఇతర నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులందరూ తప్పనిసరిగా లేబర్‌కార్డు పొంది వాటి ద్వారా అందే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని గద్వాల జిల్లా సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం ధరూరు మండలం గూడెందొడ్డిలో లేబర్‌కార్డుల నమోదుపై కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకుడు మోహినుపాషా, టీయూసీఐ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం గద్వాలజిల్లా అధ్యక్షుడు చింతరేవుల కృష్ణ, కార్మికులు పరశురాము, గోవిందు, కేశవులు, మునెప్ప, ఆంజనేయులు, నర్సింహులు తదితరులు ఉన్నారు.